సాక్షి తిరుపతి

మంగళవారం ; 24 ; జనవరి ; 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.58,880
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,252

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,400
రిటైల్ వెండి గ్రాము	రూ.72.40

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	18
చిత్తూరు	31	18
తిరుమల	27	14
గూడూరు	31	20
నగరి	32	18



ముగ్గుల పోటీలు

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చంద్రగిరి బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. - చంద్రగిరి

న్యూస్‌రీల్

పోరాటాలకు నేతాజీ ఆదర్శం



నేతాజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: పోరాటాలకు సుభాష్ చంద్ర బోస్ ఆదర్శమని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం నేతాజీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీతోపాటు డీఆర్వో శ్రీనివాసరావు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సమరంలో కీర్తి కిరీటాల్లో నిలిచిన కొంతమందిలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఒకరని, ఆయన పోరాటం ఎనలేనిదని కొనియాడారు. 1920లో సివిల్స్‌లో నాల్గవ ర్యాంకు సాధించిన నేతాజీ స్వాతంత్ర్య సమరం కోసం ఉద్యోగానికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. అలాంటి గొప్పవారిని స్మరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

అభ్యర్థనలు రేపటి లోపు అందజేయండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని ధూర్జటి కళాప్రాంగణంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలకు అభ్యర్థన లేఖలను ఈ నెల 25లోపు అందజేయాలని ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 13 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఈ నేపథ్యంలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ముందు ధూర్జటి కళాప్రాంగణంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలకు ఆలయ పరిపాలనా భవనంలోని ఈఓ కార్యాలయంలో కళాకారులు తమ అభ్యర్థన లేఖలను 25వ తేదీలోపు అందజేయాలని సూచించారు. గడువు తర్వాత వచ్చే అభ్యర్థనలు స్వీకరించమని తెలిపారు.

మృత్యుంజయ స్వామికి విశేష పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పలురకాల పుష్పాలు, గజమాల, వెండి నాగభరణాలతో స్వామిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళహారతులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా కేంద్రంలో ఈనెల 24 నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లుచేశారు. చెర్లోపల్లి వద్ద ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు 7,522 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 24, 25, 28, 29, 30, 31 తేదీల్లో పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లుచేశారు.

• జాతి కెరటానికి జోహార్లు



నాగలాపురం మండలం, ఎస్ఎస్ పురం జెడ్పీ హైస్కూల్లో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. - పిచ్చాటూరు

• అభిమాన నేతకు పాలాభిషేకాలు



తిరుపతిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు నిర్ణయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. - తిరుపతి కల్చరల్

• రహదారి భద్రతా వారోత్సవాలు



జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. తిరుపతిలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, ప్లకార్డులు ప్రదర్శించారు. - తిరుపతి క్రైం

నిత్యం పెరుగుతున్న కాలుష్యానికి సంకెళ్లు వేసేలా.. ఆధ్యాత్మిక మహానగరాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేలా.. మలయప్ప భక్తులు పరవశించేలా.. శేషాచలంలోని ప్రకృతి అందాలు తిలకించేలా.. ఆధ్యాత్మిక ఆనందంతో ఉప్పొంగేలా.. ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు అలిపిరి డిపోను రాష్ట్రంలోనే తొలి ఎలక్ట్రిక్ డిపోగా ఎంపిక చేశారు. ఇప్పటికే ఇక్కడి నుంచి 62 శాతం మేర విద్యుత్ సర్వీసులు తిప్పుతుండగా మరో పది రోజుల్లో వంద శాతం ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు చర్యలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే డిపోలో అవసరాన్ని బట్టి మార్పులు, చేర్పులు చేపడుతున్నారు.



హరిత వందనం.. అలిపిరి సొంతం!

ఆర్టీసీ జిల్లా సమాచారం

సర్వీసులు	814
ఉద్యోగులు	4,608
కండక్టర్లు	1,553
డ్రైవర్లు	1,898
గ్యారేజ్ ఉద్యోగులు	698
ఇతర ఉద్యోగులు	459
జిల్లా ఆదాయం నెలకు	రూ.32.40 కోట్లు

అలిపిరి డిపో సమాచారం

సాధారణ బస్సులు	64
విద్యుత్ బస్సులు	62
డ్రైవర్లు	162
కండక్టర్లు	116
ఇతర సిబ్బంది	128
నెలకు ఆదాయం	5 కోట్లపైనే

విద్యుత్ బస్సుల వినియోగం ఇలా

తిరుమల కొండకు	50
తిరుపతి - మదనపల్లి	12
తిరుపతి- రేణిగుంట ఎయిర్ పోర్టుకు	14
తిరుపతి- నెల్లూరు	12
తిరుపతి- కడప	12

రాష్ట్రంలో తొలి ఎలక్ట్రిక్ బస్సు డిపోగా అలిపిరి

- కాలుష్య నియంత్రణే లక్ష్యం
- తిరుమల కొండకు అధిక ప్రాధాన్యం
- మరో పది రోజుల్లో వందశాతం బస్సుల నిర్వహణ
- అలిపిరి కేంద్రంగానే డ్రైవింగ్ స్కూల్

తిరుపతి అర్బన్: నగరంలోని అలిపిరి డిపో కొత్త పుంతలు తొక్కుతోంది. కాలుష్య నివారణతోపాటు భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు రాష్ట్రంలోనే తొలి ఎలక్ట్రిక్ బస్సు డిపోగా గుర్తింపు తెచ్చుకుంది. భక్తులకు ఆహ్లాదాన్ని.. ఆనందాన్ని పంచుతూ ముందుకు దూసుకుపోతోంది. ఆదాయ అన్వేషణతోపాటు పదుగురికి ఉపాధినిచ్చే శిక్షణా కేంద్రంగా విరాజిల్లుతోంది.



అలిపిరి డిపోకు చెందిన విద్యుత్ బస్సులు

గత ఏడాదిలో ప్రారంభం

గత ఏడాది సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అలిపిరి ఎలక్ట్రిక్ డిపోను ప్రారంభించారు. అప్పటి నుంచి అధికారులు విడతల వారీగా 62 విద్యుత్ బస్సులను సమకూర్చారు. ఇందులో 22 బస్సులను తిరుపతి నుంచి తిరుమలకు, 2 బస్సులను కొత్తగా డ్రైవర్లకు శిక్షణ ఇవ్వడానికి వినియోగిస్తున్నారు. మిగిలిన 38 బస్సులు ఈ నెల 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి నడపనున్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ముందుగా తిరుమలకు 50 బస్సులను, మిగిలిన బస్సులను కేటాయింపుల వారీగా తిప్పనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

సాధారణ బస్సులు ఇతర డిపోలకు

తిరుపతి అలిపిరి డిపోలో 79 బస్సులున్నాయి. అందులో 15 బస్సులను తిరుపతి డిపోకు తరలించారు. 45 బస్సులను తిరుమలకు నడుపుతున్నారు. 13 బస్సులను బెంగళూరుకు, ఒక బస్సును ధర్మపూరికి పంపుతున్నారు. 5 బస్సులను రిజర్వులో పెట్టారు. ప్రస్తుతం అలిపిరి డిపోలో 406 మంది పనిచేస్తుండగా అందులో 9 మంది మెకానిక్‌లను తిరుపతికి డిపోకు పంపించారు. మరో పది రోజుల్లో వంద విద్యుత్ బస్సులు అలిపిరి డిపో నుంచి ఆపరేటింగ్ చేయనున్నారు.

ఆదాయంలో నం.1

ఆదాయంలో అలిపిరి డిపో దూసుకుపోతోంది. డిపోలోని 90 శాతం బస్సులను తిరుపతి నుంచి తిరుమలకు నడుపుతున్న తరుణంలో ఆదాయంలో ఎప్పుడూ ముందంజలో ఉంటోంది. గతంలోనూ ఆదాయంలో అలిపిరి డిపోనే నం.1. అదే తరహాలో విద్యుత్ బస్సులతోపాటు అవసరమైన సాధారణ బస్సులను అలిపిరి డిపో నుంచే తిరుమలకు నడపాలని యంత్రాంగం యోచిస్తోంది.

19వ బ్యాచ్ ప్రారంభం



జిల్లాలో ఏకైక డ్రైవింగ్ స్కూల్ అలిపిరి డిపో మాత్రమే కేటాయించారు. రెండేళ్లుగా డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 18 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వడంతోపాటు హెవీ డ్రైవింగ్ సర్టిఫికెట్లు ఇప్పించారు. తాజాగా 19వ బ్యాచ్‌కి రెండు రోజుల క్రితం శిక్షణ ప్రారంభించారు. మరో రెండు రోజుల తర్వాత 20వ బ్యాచ్‌కు శిక్షణ కోసం దరఖాస్తులు ఇవ్వనున్నారు. ఇప్పటికే 18 బ్యాచ్‌ల్లో 288 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు సర్టిఫికెట్లు జారీచేశారు.

అవసరాన్ని బట్టి వినియోగించుకుంటాం

ప్రయాణికుల అవసరాన్ని బట్టి బస్సులను అలిపిరి డిపోలో వినియోగించుకుంటాం. ఇప్పటికే 79 బస్సులు నడపాల్సి ఉంది. మరో 100 విద్యుత్ బస్సులు ఈ డిపో నుంచే ఆపరేటింగ్ చేస్తాం. మరోవైపు అలిపిరి డిపోలోనే డ్రైవింగ్ స్కూల్ ఉండడంతో కొంత ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలోనే కొన్ని బస్సులను అవసరం మేరకు పక్కడిపోలకు మళ్లిస్తున్నాం. అలిపిరి డిపోలో అవసరమైతే మళ్లీ వాటిని తీసుకొస్తాం. అయితే కొంతమంది డిపోను తరలిస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఇది చాలా బాధాకరం. విద్యుత్ బస్సులు వస్తుండడంతోనే కొంత మేరకు మార్పులు, చేర్పులు చేయాల్సి వస్తోంది. అంతేతప్ప డిపోను ఎక్కడికీ తరలించే ప్రసక్తే లేదు.

– చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజారవాణాధికారి, తిరుపతి

ప్రపంచవ్యాప్తంగా వకుళామాత ఆలయ ప్రతిష్ట

- టీటీడీ అధికారులతో మంత్రి పెద్దిరెడ్డి సమావేశం

తిరుపతి మంగళం: సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి మాతృమూర్తి వకుళామాత ప్రతిష్ట ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించేలా అభివృద్ధి చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి కార్యాలయంలో సోమవారం టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, జేఈఓ వీరబ్రహ్మం, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావుతో మంత్రి సమావేశం నిర్వహించారు. వకుళామాత ఆలయ అభివృద్ధిపై చర్చించారు. అలాగే పటిష్టమైన భద్రను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణమండపం, భక్తుల కోసం వసతి సముదాయం, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. వకుళామాత ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందినదని, ఆ ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు.



ఆలయ అభివృద్ధిపై చర్చిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

'ఇంటివద్దకే వైద్యం'పై పూర్తిపర్యవేక్షణ

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటి వద్దకే వైద్యం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆదేశించారు. తిరుపతిలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ప్రజలకు అందించాల్సిన వైద్య సేవలు పర్యవేక్షణపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్ఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలు ప్రతి వైఎస్సార్‌హెల్త్ క్లినిక్ పరిధిలో ప్రజలందరి ఆరోగ్యస్థితి తెలుసుకోవడంతో పాటు వారికి ఎప్పటికప్పుడు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విషయంలో పూర్తి పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యభద్రత మన బాధ్యతగా గుర్తించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేసుకొని ఇళ్ల వద్ద ఉన్న బాధితులను ఎప్పటికప్పుడు పరామర్శించాలని సూచించారు. క్రమ పద్ధతిలో షుగర్, బీపీ పరీక్షలు చేస్తూ వారి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అనంతరం వైద్యాధికారులకు జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో డాక్టర్లు వికాస్, డేనియల్‌రాజ్, తేజస్విని, రామాంజనేయులు పాల్గొన్నారు.



వైద్యాధికారులకు జ్ఞాపికలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి

జ్ఞానసముపార్జనకే చదువు



తిరుపతి అలిపిరి: చదువు జ్ఞానాన్ని పెంచేలా ఉండాలని టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో సోమవారం నూతన జాతీయ విద్యా విధానంపై ఒక్క రోజు సదస్సు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా సంస్థల్లో నూతన విద్యావిధానంపై సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్వం గురుకులంలో అర్థవంతమైన చదువు ఉండేదని, నేడు పరీక్షల నిమిత్తంగా ఉందని తెలిపారు. వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ కొత్త జాతీయ విద్యావిధానంలో విద్యార్థులు తమకు నచ్చిన విద్యను ఎంచుకోవచ్చన్నారు. అనంతరం నూతన డైరీని ఆవిష్కరించారు. వర్సిటీ డీన్ డీపీ వై.యాజులు, సంయోజకులు తారక రామ్ కుమార్‌శర్మ, పీఆర్‌వో టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో పటిష్ట భద్రత

- డాగ్ స్క్వాడ్ తనిఖీలు
- గణతంత్ర దినోత్సవంలో భాగంగా మాక్ డ్రిల్



రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీస్ జాగిలాలు

తిరుపతి అర్బన్: తిరుపతి రైల్వే స్టేషన్‌లో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) డీఎస్పీ షేక్‌షాను తెలిపారు. సోమవారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆమె ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌కు చెందిన రెండు బృందాలు తనిఖీలు చేపట్టాయి. ప్రధానంగా ప్లాట్‌ఫాంలతోపాటు దుకాణాలు, రైళ్లలోనూ తనిఖీలు నిర్వహించారు. మరోవైపు మాక్ డ్రిల్ చేపట్టారు. ఒడిస్సా నుంచి తిరుపతి మీదుగా వెళుతున్న రైళ్లలోనూ తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశారు. ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న వాయు డాగ్ (గాంజాయ్ వంటి మత్తు పదార్థాలు గుర్తింపు), స్నిఫ్ఫర్ డాగ్ ప్రిన్స్ (పేలుడు పదార్థాల గుర్తింపు)తో తనిఖీల్లో వినియోగించారు. ప్రధానంగా రేణిగుంట ఎసీఎస్ రాజు, తిరుపతి ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, జీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హేమసుందర రావు తనిఖీల్లో పాల్గొన్నారు. ఆర్‌పీఎఫ్‌తోపాటు జీఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీల్లో భాగస్వాములయ్యారు. తనిఖీల అనంతరం డీఎస్పీ షేక్‌షాను మాట్లాడుతూ సాధారణంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా ప్రతిఏటా తనిఖీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు పలుచోట్ల నిషేధిత పదార్థాలు ఏర్పాటు చేయగా వాటిని తనిఖీల్లో డాగ్‌స్క్వాడ్ గుర్తించినట్టు వెల్లడించారు.

రేషన్ బియ్యం పట్టివేత

తడ: ఆంధ్రా నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. తడ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామకృష్ణనాయక్, సూళ్లూరుపేట సీఎస్ డీటీ సంధ్య తడలో తనిఖీలు నిర్వహిస్తుండగా అదే సమయంలో శ్రీకాళహస్తి వైపు నుంచి చెన్నై వెళుతున్న మినీ లారీని పరిశీలించారు. అందులో ఆంధ్రాకి చెందిన 117 బస్తాల (3,040కిలోలు) రేషన్ బియ్యాన్ని గుర్తించారు. బియ్యంతోపాటు సరుకు తరలిస్తున్న కేవీబీపురం మండలం, అంజూరుపాళెంకు చెందిన శివప్రసాద్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని తడ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి, పట్టుబడ్డ బియ్యాన్ని పౌరసరఫరాల గోదాముకు తరలించినట్టు పేర్కొన్నారు.

ఎర్రావారిపాళెం ఎస్ఐ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు

తిరుపతి రూరల్: టీడీపీ నాయకుడి చేతికి లాఠీ ఇచ్చి కొట్టించాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎర్రావారిపాళెం ఎస్ఐపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే భాకరాపేట సీఐ తులసీరాం సోమవారం బాధితుడిని విచారించారు. బండమీదకమ్మపల్లిలో గురువారం చోటుచేసుకున్న ఘటన మొదలు స్టేషన్‌లో బాధితుడి పట్ల ఎస్ఐ వ్యవహరించిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితుడి వాంగ్మూలాన్ని వీడియో రికార్డు చేసుకోవడంతోపాటు రాతపూర్వకంగా రాయించుకున్నారు. ఎస్ఐ తనను విచక్షణారహితంగా కొట్టడంతోపాటు బంధువులపై చేయి చేసుకున్నారని, తన తల్లిని అవమానకరంగా మాట్లాడారని బాధితుడు వాపోయాడు. అంతటితో ఆగక మహేష్ నాయుడి చేతికి లాఠీ ఇచ్చి కొట్టించారని కన్నీటిపర్యంతమయ్యాడు. సీఐ విచారణపై తనకు నమ్మకం ఉందని, తన కుటుంబం పట్ల ఎస్ఐ వ్యవహరించిన తీరుకు తగిన చర్యలు తీసుకోవాలని మురుగేష్ ప్రాధేయపడ్డాడు. విచారణలో తేలిన విషయాలపై నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్టు సీఐ తెలిపారు.

గౌహతికి సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



మృతుడు సుబ్బారెడ్డి సతీమణికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: పూతలపట్టు వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి వైఎస్సార్ సీపీకి ఎనలేని సేవలు అందిచారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం తిరుపతి మారుతీనగర్‌లోని తన నివాసంలో మృతుడు సుబ్బారెడ్డి సతీమణి గౌహతిరెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సాటి ఎవరూ లేరని తెలిపారు.

27 గొర్రెల చోరీ

సైదాపురం: మండలంలోని మొలకలపూండ్ల గ్రామంలో ఆదివారం రాత్రి 27 గొర్రెలు చోరీ కి గురయ్యాయి. సోమవారం బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని మొలకలపూండ్ల గ్రామానికి చెందిన పచ్చికాయల శ్రీనివాసులు గొర్రెలను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలో ఒక దొడ్డిని ఏర్పాటు చేసుకుని, అందులో గొర్రెలను ఉంచేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు దొడ్డిలోని 27 గొర్రెలను ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే దొడ్డి వద్దకు వచ్చేసరికి గొర్రెలు కనిపించకపోవడంతో ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటి విలువ రూ.2.5 లక్షలు ఉంటాయని బాధితుడు పేర్కొన్నాడు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

ఏర్పేడు: తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధురాలు(72) మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ఈ నెల 1న స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు తలకు గాయాలై ఆర్అండ్‌బీ రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిఉన్న గుర్తుతెలియని వృద్ధురాలిని ఏర్పేడు 108 సిబ్బంది చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించినట్లు వివరించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు సోమవారం రాత్రి మృతి చెందినట్టు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440900729 నంబరుకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్: విద్యుత్‌శాఖకు చెందిన రాగి వైర్లను అపహరించుకెళ్లిన కేసులో ఇద్దరికి ఫిబ్రవరి 6వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ సోమవారం ఆదేశాలు జారీచేశారు. వడమాలపేట కాయం వీధికి బోయనపల్లి మహేష్, చంద్రగిరి మండలం పైడిపల్లికి చెందిన కొండ్లూరు ఆదినారాయణ ఈనెల 19వ తేదీ గాజుల మండ్యం దళితవాడ సమీపంలోని వ్యవసాయ భూముల్లో ఉన్న విద్యుత్‌శాఖకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను కిందకుదించి పగులగొట్టి ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైర్‌ను అపహరించుకెళ్లినట్టు తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు ఇద్దరినీ గాజుల మండ్యం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

తిరుమల వ్యాపారులకు టౌన్ బ్యాంకులో రుణాలు



మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు చైర్మన్

తిరుపతి మంగళం: తిరుమలలోని వ్యాపారులకు రుణాలు ఇవ్వనున్నట్టు తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంకు (టౌన్ బ్యాంకు) చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం వైస్ చైర్మన్ వాసుయాదవ్, ఎండీ విజయ భారతి, డైరెక్టర్లతో కలిసి తిరుమల బాలాజీనగర్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కేతం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ తిరుపతి టౌన్ బ్యాంకు నుంచి ఇప్పటి వరకు తిరుమల వ్యాపారులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకురాలేదన్నారు. తమ పాలక మండలి రుణాలు ఇచ్చి వ్యాపారుల అభివృద్ధికి చేయూత ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. తిరుమలలో వ్యాపారం చేసుకుంటూ హ్యాకర్స్ లైసెన్స్ కలిగిన వారికి రూ.5 లక్షలు, షాపు లైసెన్స్ కలిగిన వారికి రూ.10 లక్షల రుణం ఇస్తామన్నారు. సమావేశంలో టౌన్ బ్యాంకు డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, వేమూరి జ్యోతిప్రకాష్, పోలిరెడ్డి నాగిరెడ్డి, కాసీమ్(చోటాబాయ్), మబ్బు నాదమునిరెడ్డి, అనీల్‌రాయల్, రేమాల బ్రహ్మానందరెడ్డి, వెంకటేష, మాకం చంద్రయ్య, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

63 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, పబ్లిక్ స్థలంలో డబ్బుపెట్టి పేకాట ఆడడం తదితర నేరాలకు పాల్పడిన 63 మందికి రూ.51,200 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్, ఈస్టు, ఎస్వీయూ పోలీసులు 63 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

11 నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 10న అంకురార్పణ చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, తిరిగి రాత్రి 8 నుంచి 10 గంటల వరకు స్వామివారి వాహన సేవ లు నిర్వహిస్తారు. 11వ తేదీ ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం హంస వాహన సేవ, 12న సూర్యప్రభ, చంద్రప్రభ, 13న భూత వాహనం, సింహ వాహనం, 14న మకర వాహనం, శేష వాహనాల్లో స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే 15న తిరుచ్చి ఉత్సవం, అధికార నంది వాహనం, 16న వ్యాఘ్రవాహనం, గజవాహనం, 17న కల్పవృక్ష వాహనం, అశ్వవాహనం, 18న రథోత్సవం, నంది వాహనం, 19న పురుషామృగవాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి తిరుచ్చి ఉత్సవం చేపట్టనున్నారు. 20వ తేదీన చేపట్టే త్రిశూల స్నానం, ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న గోరేటి వెంకన్న, సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్

గూడూరురూరల్: విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలు ఏర్పరుచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఐఐపీఎం చైర్మన్ అరిందమ్ చౌదరి సూచించారు. సోమవారం గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐఐపీఎం చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు తమ భవిష్యత్‌కు లక్ష్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. ప్రస్తుతం యూట్యూబ్ చానళ్ల ద్వారా విద్యార్థులు అపారమైన జ్ఞానాన్ని సంపాదించవచ్చని చెప్పారు. అనంతరం ప్రముఖ కవి గోరేటి వెంకన్న పల్లె కన్నీరు పెడుతోందనే పాటను, సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ తన మధురమైన పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. ప్రముఖ జర్నలిస్ట్ పాశం యాదగిరి విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించుకుని పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయలను కొనసాగించాలని కోరారు. అనంతరం ఫ్రెషర్స్ డే సందర్భంగా వారం రోజులపాటు నిర్వహించిన ఆటపాటలు, నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, డైరెక్టర్ డాక్టర్ ఎ.మోహన్, ఎఫ్ఎంఈ విభాగాల అధిపతులు డాక్టర్ వై.హరినాథ్, సీహెచ్ సురేష్, ఏ.ఓ. జె.రామయ్య, ప్రిన్సిపాళ్లు వేణుమాధవ్, ధనుంజయ పాల్గొన్నారు.

స్పందనకు హాజరు కావాల్సిందే





అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ, ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి

తిరుపతి అర్బన్: స్పందనకు ప్రతి విభాగానికి చెందిన జిల్లా అధికారి హాజరు కావాల్సిందేనని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి ఆయన జేసీ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు, గాలేరు–నగరి సుజల స్రవంతి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌కోదండరామిరెడ్డి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ప్రారంభం నుంచి ముంగింపు వరకు ప్రతి అధికారి అందుబాటులో ఉండాలన్నారు. అర్జీదారుల నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులు పనిచేయాలని చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 112 అర్జీలు రాగా అందులో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించినవి 71 వినతులు ఉన్నట్టు తెలిపారు.

పోలీసు స్పందనకు 68 ఫిర్యాదులు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 68 వినతులు వచ్చినట్టు ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగ తనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద సంఖ్యలో ఫిర్యా దులు వచ్చినట్టు వారు వెల్లడించారు. సంబంధిత అర్జీలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

30 నుంచి అవగాహన సదస్సులు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 30 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి అరుణసులోచన, డీఈఓ శేఖర్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, స్త్రీశిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి జయలక్ష్మి తదితరులతో కలిసి కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన సదస్సుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2015 నుంచి స్పర్శ, కుష్ఠు వ్యాధి నివారణ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: కాలుష్య నియంత్రణతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్లాస్టిక్ ఫ్లెక్సీల వాడకాన్ని నిషేధిస్తున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి, వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ముందుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవం నుంచి ప్లాస్టిక్ వాడకాన్ని రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ప్లాస్టిక్‌ను వాడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు నిబంధనలు జారీ చేయనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నరేంద్రబాబు, డీపీవో రాజశేఖర్‌రెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ హరీష్‌కుమార్, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి సీతారామిరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ తిరుపతి చంద్రమౌళేశ్వర్‌రెడ్డి, డీఎల్‌డీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రెస్పాన్సిబుల్ యాదవ్ జేఏడబ్ల్యూసీ జిల్లా సమావేశం



మణిగోపాల్ యాదవ్‌కు నియామక పత్రం అందజేసి సత్కరిస్తున్న సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని ఏపీ రెస్పాన్సిబుల్ యాదవ్ జాయింట్ యాక్షన్ వెల్ఫేర్ సొసైటీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు మణిగోపాల్‌యాదవ్ తెలిపారు. తిరుపతిలో సోమవారం జేఏడబ్ల్యూసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల నూతన అధ్యక్షుడుగా మణిగోపాల్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో సుమారు 14 శాతం ఉన్న యాదవ కులస్తులకు రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యత కల్పించాలని తీర్మానించినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కనీసం 25 అసెంబ్లీ స్థానాలు, 5 పార్లమెంట్ స్థానాలు యాదవ కులస్తులకు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెస్పాన్సిబుల్ యాదవ్ జాయింట్ యాక్షన్ వెల్ఫేర్ సొసైటీ మీడియా అధ్యక్షుడు ఎ.బాలాజీ యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గాయత్రి, శ్రీనివాసులు యాదవ్, మంజుల, జయప్రకాష్ యాదవ్, బాలాజీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో సరుకుల రవాణా వ్యాన్ బోల్తా



బోల్తాపడ్డ వ్యాన్





గాయపడ్డ వ్యక్తులు

- ముగ్గురికి గాయాలు..

వారిలో ఒకరి పరిస్థితి విషమం

తిరుమల: తిరుమల ఘాట్ రోడ్లో సరుకులు తరలించే వాహనం బోల్తా పడి ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వారిలో ఒక వ్యక్తి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సోమవారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుంది. తిరుమల ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది తెలిపిన వివరాలమేరకు.. తిరుమల నుంచి సరుకు రవాణా వ్యాన్‌లో కొబ్బరి చిప్పల లోడుతో డ్రైవర్ యువరాజు, మరో ఇద్దరితో కలిసి తిరుపతికి బయలుదేరాడు. మొదటి ఘాట్ రోడ్డు 9వ మలుపురాగానే వ్యాన్ వేగంగా రక్షణ గోడను ఢీకొంది. దీంతో వ్యాన్ లోని ఒక వ్యక్తి రక్షణ గోడను దాటి అవతల వైపు చెట్ల మధ్యలో పడ్డాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్ కూడా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ఇతర వాహనాల్లోని భక్తులు గాయపడిన వారిని రక్షించి అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.